# బాబు

"శశి"

"సంజచీకట్లు అలముకుంటున్నవి. ఆవులు 'అంబా' అని అరుస్తూ, యిళ్లకు తిరిగి వస్తున్నవి. వాటి గిట్టల తాకిడికి రేగిన ఎఱ్ఱటిదుమ్ము, పరిసరాల్ని మరీ ఎఱుపుగా చేస్తున్నవి. పిట్టలు అరుస్తూ; తమ, తమ గూండ్లను జేరుకుంటున్నవి. గుడిగంటలు అస్పష్టంగా వినబడ్తున్నవి. పెద్దగా ధ్వనిచేస్తూ; వంతెన మీదుగా, రైలు వెళ్ళిపోయింది. ప్రక్క యింట్లోంచి జోలపాట సన్నగా వినబడ్తున్నది. మల్లెపూలు తమ సుగంధాన్ని గాలిలో వ్యాపింపచేసి, పరిసరాల్ని మత్తెక్కిస్తున్నాయి.

'బాబు' అలా శూన్యంలోకి చూస్తూ; చాలా సేపటినుంచీ; మల్లెతీగ ప్రక్కగానున్న, అరుగుమీద కూర్చునివున్నాడు. అతని చిన్నారి కళ్ళనిండా నీరు తొణికిసలాడుతుంది. ఆ చిన్నారి పాలబుగ్గల మీదుగా, ఒక్కొక్క కన్నీటి బొట్టు జారి; చొక్కామీదపడి; యింకిపోతున్నది. బాబు ఆ కన్నీటిని చొక్కాతో తుడుచుకోనైనా తుడుచుకోవటంల్లేదు. అతనివైపుచూచి ఏమీ అర్థంగాక వెళ్ళబోయి, మళ్లీ అక్కడే కూర్చుండిపోయింది తెల్ల పిల్లిపిల్ల. జుట్టురేగి నుదుటిమీదపడి; ఆ లేత వదనానికి క్రొత్తశోభ కూరుస్తుంది.

ఇంతలో బాబును వెదుకుతూ శారద అటువైపుగా వచ్చింది. వెనుకనుంచి బాబునుచూచి దగ్గరగావస్తూ "బాబూ! యిక్కడ చీకట్లో కూర్చున్నావా? లోపలికి వెళ్దాం రా" అని బాబు బుజంమీద చెయ్యివేసి, ముఖాన్ని తనవైపు త్రిప్పుకొని కన్నీటి తడిమిచూచి; "ఏడుస్తున్నావా బాబూ?" అని అడిగింది. "వదినా" అని బావురుమన్నాడు బాబు. బాబును హృదయానికి హత్తుకుంటూ "ఏడవకు బాబూ! రా! భోంచేద్దువుగాని" అని బాబును ఎత్తుకొని యింట్లోకి తీసుకువెళ్ళి పీటమీద కూర్చోబెట్టి; అన్నంకలిపి అతనిముందుపెట్టి తినమని శారద దొడ్లోకి వెళ్ళింది.

మళ్ళీ 5 నిముషాలకు లోపలికి వచ్చింది శారద. బాబు అలానే ఏడుస్తూ కూర్చుని వున్నాడు. "తొందరగా తిను బాబూ! మళ్ళీ మీ అన్నయ్య వస్తారు" అని హెచ్చరించింది. బాబు తలెత్తి, ఆమె ముఖంలోకి చూచాడు. ఆ విచారవదనాన్ని చూచేటప్పటికి, శారదకుకూడా దుఃఖం ఆగలేదు. కానీ ఆమె ఎలాగో ఆపుకొని, బాబు ప్రక్కన కూర్చుని; ఆమె ఒక్కొక్క ముద్ద బాబు నోట్లోపెట్టి తినిపించింది. తర్వాత పక్కవేసి బాబును పడుకోబెట్టి ఆమె వెళ్లబోయింది. బాబు ఆమె చెయ్యిపట్టుకొని, "వదినా నాకు భయంగావుంది. నీవుకూడా వుండవూ" అని దీనంగా అడిగాడు. శారద అతని ప్రక్క; బాబుమీద చెయ్యివేసి, చిచ్చికొట్టూ కూర్చుంది. బాబు కాస్సేపటికల్లా నిద్రపోయాడు.

శారద కక్కడినుంచి, వెళ్ళుబుద్ధిపుట్టలేదు. దీపం సన్నగా వెలుగుతుంది. దాని చుట్టూ రెండు పురుగులు ఎగురుతున్నాయి. శారదకు గడచిన రోజులన్నీ గుర్తుకు వస్తున్నవి.

♦ ♦ ♦

శారద కాపురానికి రాకముందే, ఆమె మామగారు మరణించారు. అప్పటికి బాబు రెండేండ్లవాడు. అప్పటినుంచీ ఆమె భర్త రఘు కుటుంబవ్యవహారాలు చూస్తూ వచ్చాడు. ఆమె అత్త 'సుందరమ్మ' వట్టి అమాయకురాలు. ఆమె శారద కాపరానికొచ్చిన క్రొత్తలో ఏపనీ చేయనీక, తనే అన్ని పనులూ చేసేది. కానీ శారదే తనుకూడా కొన్ని కొన్ని పనులలో అత్తగారికి తోడ్పడుతుండేది. శారద కప్పుడు తనంత అదృష్టవంతురాలెవ్వరూ లేరనే భావనవచ్చేది. ఏమంటే. అనుకూలుడైన భర్త. కష్టసుఖా లెరిగిన అత్త. తక్కిన విషయాలలో ఏమీ లోటులేదు. కాలం హాయిగా, సుఖంగా గడిచిపోతున్నది. 15 రోజుల క్రితం సుందరమ్మ ఉబ్బస వ్యాధితో మరణించింది. చనిపోయేముందు "బాబును

జాగ్రత్తగా చూడమని మరీ, మరీ చెప్తూ; తనచేత ఒట్టు వేయించుకొని" తృప్తిగా కళ్లు మూసింది.

కానీ బాబు వాళ్ళమ్మకోసం ఒకటే ఏడుపు. మొదట్లో "ఆమె ఎక్కడికో వెళ్లిందని, మళ్లీ వస్తుందని" శారద బాబుకు చెప్పింది. బాబు 4 రోజులు వూరుకున్నాడు తర్వాత మళ్ళీ మొదలెట్టాడు ఏడుపు. ఇక గత్యంతరంలేక "వాళ్లమ్మను ఒక భూతం ఆకాశంలోకి ఎత్తుకుపోయిందనీ, బాబు కనుక ఏడిస్తే బాబును ఆ భూతం కొడ్తుందని" భయపెట్టింది శారద. కానీ బాబు ఏడుపు మానలేదు. రఘు 3 రోజులక్రితం విసుగెత్తి; "బాబు కనుక ఏడిస్తే కొట్టానని" గట్టిగా మందలించాడు. అప్పట్నుంచి బాబు పెరట్లో మల్లెతీగ ప్రక్క అరుగుమీద కూర్చుని; ఆకాశంలోకి చూస్తూ తనలో తాను ఏడుస్తుండేవాడు.

♦ ♦ ♦

ఆమె ఆలోచనలకు అంతరాయంగా రఘు వచ్చాడు. అతనికి భోజనంపెట్టి; తను భోజనం చేసి; బాబు దగ్గరకి వచ్చింది. అమాయకంగా నిద్రపోతున్నాడు బాబు. దుప్పటికప్పి ఆమె వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు బాబుకు జ్వరం వచ్చింది. ఆ సంగతి శారద రఘుకు చెప్పింది. ఏమీ ఆందోళన కనబరచకుండా; "అదే పోతుందిలే! ఆచార్యులుగారిదగ్గర్నుంచి, ఏవన్నా మాత్రలు తెస్తానులే" అన్నాడు. ఆ రోజు తొందరగా పనులన్నీ ముగించుకొని; బాబు దగ్గర కూర్చుని విసురుతుంది. బాబు "అమ్మా! అమ్మా" అంటూ ఒకటే ఏడుస్తున్నాడు. ఆ రోజు సాయంత్రం రఘు ఏవో మాత్రలు తెచ్చి వేసాడు. దీపాలవేళకి బాబు ఒళ్లు వేడి కొద్దిగా తగ్గింది.

ఆ రోజుకూడా రఘు బలవంతంమీద బాబును మేడమీద ప్రక్కగదిలోనే పడుకోబెట్టింది.

ఆ రాత్రి బాబుకు భయంకరమైన కల వచ్చింది. ఆ కలలో బాబుకు వాళ్లమ్మ కనిపించింది. బాబును దగ్గరకు రమ్మని చేతులు చాచింది. బాబు ఎంతో సంతోషంతో అమ్మ దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో వాళ్ళమ్మను ఏదో పొగ ఆవరించింది. బాబు ఒక్క క్షణం ఆగిపోయాడు. పొగ పోయింది. బాబు మళ్లీ పరుగుతీసాడు. కానీ ఎవరో పెద్దతల; పొడుగు చేతులు; కాళ్లు; 4 గుమ్మడికాయలంతపొట్ట; నారింజకాయలంత రెండు ఎఱ్ఱటి కళ్లూ కలిగిన ఒకడు; భూతం కాబోలు అమ్మను గట్టిగ పట్టుకున్నాడు. అమ్మ కెవ్వున కేకవేసింది బాబు ఇంకా తొందరగా పరుగెత్తటం మొదలు పెట్టాడు. కాని భూతం వాళ్లమ్మను దూర దూరంగా తీసుకువెళ్తున్నాడు. కాస్సేపటికల్లా వాళ్ళిద్దరూ కనబడకుండా మాయమైపోయారు.

కెవ్వున కేకవేసి బాబు లేచాడు. చుట్టూ చీకటి. "వదినా" అని పిలిచాడు. జవాబులేదు. బాబుకు ఏడుపు వచ్చింది. ఇంతలో బాబుకు దాహంవేసింది. నెమ్మదిగా పక్కమీదనుంచిలేచి, చీకట్లో తడుముకుంటూలేచి, ఎలాగో తంటాలుపడి బయటకు వచ్చాడు. అక్కడకూడా చీకటే! అలాగే తడుముకుంటూ ముందుకు వెళ్తున్నాడు. హఠాత్తుగా కాలు జారింది. "వదినా" అని అరచి ముందుకు మెట్లమీదుగా దొర్లిపోయాడు బాబు.

బాబు కేకకు శారద వులిక్కిపడిలేచి లైటు తీసుకొని తలుపుతీసి బాబు గదిలోకి వెళ్లింది. అక్కడ పక్క ఖాళీగావుంది. 'బాబూ' అని పిలుస్తూ గాభరాగా బైటకువచ్చి మెట్లమీదనుంచి క్రిందకు చూచింది. మెట్లక్రింద బాబు నెత్తురు మడుగులో పడివుండటం ఆమెకు కనిపించింది. "ఏమండీ" అని గట్టిగా రఘును పిలిచి తడబడ్తున్న కాళ్ళతో మెట్లు దిగి బాబు దగ్గరకు వెళ్లింది. బాబు అప్పటికే వాళ్ళమ్మను చేరుకున్నాడు.

రఘు శారద కేకకు లేచి ఆవులిస్తూ "శారదా" అని పిలుస్తూ బైటకువచ్చి మెట్లక్రింద "బాబుమీద పడి శారద ఏడవటంచూచి" నిశ్చేష్టుడైపోయాడు రఘు "

---